www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 1 ఫిబ్రవరి 2024
5
చిత్తూరు

తహశీల్దార్ల బదిలీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 51 మంది తహశీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం ఉమ్మడి జిల్లాలో 67 మండలాల్లో 51 మందిని కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలకు బదిలీ చేసింది. మూడు సంవత్సరాలు పూర్తి కాని 16 మందిని వారి స్థానాల్లోనే ఉంచింది. మూడు సంవత్సరాలు పనిచేసిన తహశీల్దార్లను బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొంది. ఈమేరకు చిత్తూరుజిల్లాలో పెద్దపంజాణి మండలం లోకేశ్వర్‌రెడ్డి, అరుణకుమారి చిత్తూరు రూరల్, జనార్ధన్, రాజు, కలెక్టరేట్ ల్యాండ్ సర్వే డిపార్టుమెంట్, వెంకటేశ్వరన్ ఎల్‌పి సెక్షన్ కలెక్టరేట్, ప్రసాద్‌బాబు డిఆర్‌ఒ కార్యాలయం, డివిజనల్ అడిషన్ ఆఫీసర్, కుప్పస్వామి పలమనేరు తహశీల్దార్ విజయభాస్కర్ పూతలపట్టు, సుశీల ఐరాల, గుణశేఖర్‌రెడ్డి తవనంపల్లి, వెంకటేశులు విజయపురం, ప్రసన్నకుమార్ నాగలాపురం, రఫిక్ అహ్మద్ బికొత్తకోట, మంజుల నిమ్మనపల్లి, క్రిష్ణమోహన్ కలెక్టరేట్ బదిలీ అయిన వారిలో ఉన్నారు.

ప్రాణం తీసిన విద్యుత్ తీగ

- అడవి జంతువుల కోసం వేసిన ఉచ్చుకు యువకుడు బలి
- మరొకరికి తీవ్రగాయాలు
- మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు

గణపతి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- సోమల: మండలం ఆవుల పల్లె పంచాయతీ దేవల కుప్పం గ్రామం యానాది కుటుంబానికి చెందిన గణపతి(21) అనే యువకుడు అడవి జంతువుల కోసం అక్రమంగా తీసిన విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో మృతుడిని కాపాడేందుకు ప్రయత్నించగా మరో వ్యక్తి తీవ్ర గాయాలు కాగా వారితో ఉన్న బాలుడు క్షేమంగా బయటపడ్డాడు. మృతుడి భార్య నాగవేణి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట నరసింహులు తెలిపారు. వివరాల్లోకి వెళితే యానాది కుటుంబానికి చెందిన గణపతి, సిద్దయ్య, ఈశ్వరయ్య ముగ్గురు మంగళవారం సాయంత్రం కూలి పనులు ముగించుకుని ఇంటి వద్ద ఉండగా అదే గ్రామానికి చెందిన చందు అనే వ్యక్తి తాను అడవికి గొర్రెలు మేపుకొని వెళ్లగా వాటిలో కొన్ని ఇంటికి రాలేదని వెళ్లి గొర్రెల కోసం వెతుకుదామని ముగ్గురిని పిలిచాడు. ముగ్గురు కలిసి సుందరనాయుడు మామిడి తోట వైపు గొర్రెలను వెతికేందుకు వెళ్లారు. అడవి పందులను చంపడానికి అక్రమంగా పొలంలో తీసిన విద్యుత్ వైర్లు గమనించకుండా గణపతి ముందుకు వెళ్లడంతో వైర్లు తగులుకొని కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే పడిపోయాడు. విషయం గమనించిన సిద్ధప్ప గణపతిని కాపాడేందుకు వెళ్లి తను కూడా కరెంట్ షాక్‌కు గురై పక్కకు పడిపోయాడు. ఇది గమనించిన ఈశ్వర వెంటనే గ్రామంలోని వారికి ఫోన్‌చేసి జరిగిన విషయాన్ని తెలిపి వెంటనే వీరిని కాపాడేందుకు రావాలని కోరాడు. హుటాహుటిన గ్రామంలోని కొందరు సంఘటనా స్థలానికి చేరుకుని ఆటోలో పెద్ద ఉప్పరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. హాస్పిటల్ వద్దకు చేరుకోగానే గణపతి మృతి చెందగా ఈశ్వరయ్యకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం సదుం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదులో తనది గంగవరం మండలం కీలపట్ల గ్రామం అని, తనకు నాలుగు నెలల క్రితం తన తల్లిదండ్రులు గణపతితో వివాహం జరిపించారని, పారాణి ఆరకముందే తన భర్త అసువులు బాసాడని ఇందుకు కారణమైన వారికి పై కఠినచర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఎడవల్లి మల్లికార్జున మామిడి తోపులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ నుండి ఎడవలి సుధాకర్ నాయుడు, ఎడవలి మల్లికార్జున నాయుడు, గుత్తా సుందరనాయుడు, చంద్ర నాయుడు వీరు తీసిన అక్రమ విద్యుత్ వైర్ కారణంగా తన భర్త మృతి విద్యుత్ షాక్ గురై చనిపోయాడని పోలీసులకు ఫిర్యాదులో పేర్కొంది.

విద్యుత్ శాఖ పర్యవేక్షణ లోపం..

ఆవులపల్లి పంచాయతీ దేవలకుప్పం యానాది వాడకు చెందిన గణపతి విద్యుత్ షాక్‌కు గురై బుధవారం మరణించిన సంఘటనలో విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం పర్యవేక్షణ లోపం కారణంగా తెలుస్తోందని ప్రజలు అంటున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో ఎందరో ఇలా అక్రమ విద్యుత్ కనెక్షన్లు తీయడం వల్ల వాటిని తగులుకొని అమాయకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయిన సంఘటనలు ఉన్నాయి. జరిగిన వాటి నుండి పాఠాలు నేర్చుకోవాల్సిన విద్యుత్ శాఖ అధికారులు పర్యవేషణ లోపం కారణంగా మరింత మంది ప్రాణాలు బలిగొనేందుకు తావిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో అక్రమ విద్యుత్ కనెక్షన్లు వాడటం వల్ల జరిగే ప్రమాదాలు అలా అక్రమ విద్యుత్ కనెక్షన్లు తీస్తే తీసుకునే చర్యలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తే ఇలాంటివి మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా నివారించే అవకాశం ఉంది. కానీ అలాంటివేవీ లేకుండా నిమ్మకు నీరు ఎత్తినట్టుగా విద్యుత్‌శాఖ వ్యవహరిస్తుండడంతో నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. ఇకనైనా విద్యుత్ శాఖ వారు గ్రామాలలో ప్రజలను చైతన్య పరిచే విధంగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

రూ.25లక్షలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

సోమల మండలం ఆవులపల్లి పంచాయతీ చిన్న దేవల కుప్పం గ్రామానికి చెందిన యానాది కాలనీ నివాసి గణపతి(21) అడవి పందులను చంపేందుకు పంట పొలాలలో తీసిన అక్రమ విద్యుత్ కనెక్షన్ కారణంగా మృతి చెందాడని అతడి కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల నష్టపరిహారాన్ని అందజేసి అన్ని విధాల కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం పర్యవేషణ లోపం కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని మంత్రి సొంత నియోజకవర్గంలో జరిగిన ఈ సంఘటనకు తక్షణం స్పందిస్తూ మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి: ఎమ్మార్పీఎస్

విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన గణపతి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, మృతుని కుటుంబానికి రూ. 50లక్షల నష్టపరిహారాన్ని అందజేయాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం అందజేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు ప్రకాష్, నాయకులు మొగిలిశ్వరయ్య, ప్రభు, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల వద్ద నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

యుటిఎఫ్ రిలే దీక్షలు ప్రారంభం

ఉపాధ్యాయుల దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

దీక్షలను ప్రారంభించిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరుతూ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు బుధవారం స్థానిక ఆర్‌డిఒ కార్యలయం ఎదుట రిలే దీక్షలకు పూనుకున్నారు. రిలే దీక్షలనుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవి రమణ మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ రద్దు అవ్వాలన్నా, పాత పెన్షన్ విధానం అమలు చేసే విషయం రాజకీయ అజెండాగా మారడానికి ఫిబ్రవరి నెల 3వ తేదీ వరకు రాష్ట్ర సంఘం ఇచ్చిన రిలే నిరాహార దీక్షలు జరుగుతాయని తెలిపారు. బుధవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఉద్యోగ ఉపాధ్యాయవర్గాన్ని తీవ్రమైనటువంటి నిరాశకు గురి చేశారని, వేలాదిగా ఖాళీలు ఉన్నప్పటికీ కేవలం 600 ఉపాధ్యాయ పోస్టులను మాత్రమే ఆమోదించడం కంటి తుడుపు చర్యగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మణిగండన్ కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. జిల్లా కార్యదర్శులు ఏ.కృష్ణమూర్తి, సరిత, పార్థసారథి, పంటపల్లి సురేష్, సి.వెంకటేశ్వర రెడ్డి, మండలాల బాధ్యులు, మోహన్ రెడ్డి, సర్దార్, మోహన్ బాబు, సురేష్ కుమార్, నగేష్, దొడ్డ బాబు ,రవికుమార్, మోగిలయ్య, రాజేష్ కుమార్, చిరంజీవి, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల, ఉద్యోగులు దాచుకున్న డబ్బులను రూ. 18వేల కోట్లను ఇతర వాటికి మళ్ళించి, వారికి ఇవ్వకపోవడం దారుణమని, బకాయి ఉన్న వాటిని వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం చిత్తూరు ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలను వాడ గంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి ఉద్యోగం చేసి జీతంలో నుండి కోత విధించుకుని భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని దాచుకున్న డబ్బులను ప్రభుత్వం దుర్మార్గంగా అక్రమంగా వేరే పథకాలకు మళ్లించడం దారుణమన్నారు. వెంటనే బకాయి ఉన్న రూ. 18,000 కోట్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం పోరాటం చేస్తుంటే అతి దారుణంగా వారిపై నిర్బంధాలు ప్రయోగించి అరెస్టులు చేయడం దారుణమన్నారు. విద్యా వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసి పేద, మధ్యతరగతి వర్గాలకు విద్యను దూరం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి దక్కుతుందన్నారు. ఇప్పటివరకు ఐదు సంవత్సరాల కాలంలో ఒక డీఎస్సీ కూడా ఇవ్వకుండా నిరుద్యోగులకు ఇబ్బందులకు గురి చేశారు. ఇలాంటి ప్రభుత్వానికి ఉద్యోగులు ఉపాధ్యాయులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకముందే ఉపాధ్యాయుల బకాయిలను విడుదల చేసి వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మార్చికి 1,883 యూనిట్లు పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్న పాలవెల్లువ కార్య క్రమంలో భాగంగా పాలు పోసే మహిళా పాడి రైతులకు డిఆర్‌డిఏ సమన్వయంతో బ్యాంకుల ద్వారా రుణాలు పొంది 2024 మార్చి నాటికి 1,883 యూనిట్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న పాలవెల్లువ కార్యక్రమం అవుతున్న 14 మండలాల ఎంపీడీఓలు, ఏపీఎంలు, మెంటార్స్, రూట్ ఇన్‌ఛార్జిలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయడం జరుగుతున్నదన్నారు. జగనన్న పాలవెల్లువలో పాలు పోసే మహిళా పాడి రైతులకు, ఆసక్తి ఉన్న మహిళా పాడి రైతులు వారి పాడి సంపదను పెంపొందించు కొనేందుకు తద్వారా పాలు పోసే సామర్థ్యాన్ని పెంచుకునేందుకు డిఆర్‌డిఏ ద్వారా బ్యాంకుల సమన్వయంతో ఆర్థిక సహాయం పొంది 2024 మార్చినాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. దీనితోపాటు మహిళా డెయిరీ సహకార సంఘాల సొసైటీల పేరిట బ్యాంకులలో ఖాతాలు తెరిచే ప్రక్రియను 2024 ఫిబ్రవరి 3వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఈ విషయంలో సహకార శాఖ డిఆర్డిఏ, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా పశు సంవర్ధక శాఖ, సహకారశాఖ అధికారులు ప్రభాకర్ బ్రహ్మానంద రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొళ్లత్తూరు క్రీడాకారులు

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ఆడదాం..ఆంధ్ర.. క్రీడాపోటీల్లో భాగంగా మండలంలోని కొళ్లత్తూరు పంచాయతీ నేలపల్లి పాఠశాల క్రీడాకారులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు సర్పంచ్ రవికుమార్, మాజీ ఎంపిటిసి ప్రసాద్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీ స్థాయి నుంచి పలమనేరు నియోజకవర్గ స్థాయి వరకు వాలీబాల్ పోటీల్లో విజయం సాధిస్తూ బుధవారం జరిగిన జిల్లాస్థాయిలో పోటీల్లో పూతలపట్టు నియోజకవర్గ క్రీడాకారుణులతో ఫైనల్ విజయం సాధించినట్లు తెలిపారు. అత్యంత ప్రతిభ చూపించి వాలీబాల్ క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎంపికై పంచాయతీకి, మండలానికి మంచిపేరు తీసుకురావడం సంతోషకరమని వారిని పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి అభినందించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు

మండల విద్యార్థి దివ్య

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి దివ్య ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ సుభాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ నెలలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున 67వ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ విద్యార్థి పాఠశాలలో 9వ తరగతి విద్య అభ్యసిస్తూ క్రీడలు పట్ల ఆసక్తి చూపుతూ అంచలంచెలుగా జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎదిగిందన్నారు. జార్ఖండ్‌లోని రాంచిలో జనవరి 31, నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జరుగుతున్న 67వ జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థిని ఎంపిక అవ్వడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీడీలు రాష్ట్ర కురువ సంఘం అధ్యక్షులు అమర్నాథ్, సర్పంచ్ రత్నయ్య గ్రామస్తులు అభినందించారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి: జేసి

ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : రాష్ట్రంలో గల యువత క్రీడా స్ఫూర్తిని ప్రతిభను రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్ర ఆటల పోటీల ద్వారా వెలికి తీస్తున్నదని చిత్తూరు నగర మేయర్ అముద పేర్కొన్నారు. బుధవారం చిత్తూరులోని మెసానికల్ గ్రౌండ్‌లో జిల్లాస్థాయి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నగర మేయర్ అముద, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల మానసిక ఉల్లాసాన్ని, శారీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో క్రీడలు ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. యువత తమ శారీరక దృఢత్వాన్ని,పెంపొందించుటకు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకొనుటకు ఆడుదాం ఆంధ్ర ఒక మంచి వేదిక అని తెలిపారు. జేసి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో గల క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బాడ్మింటన్ వంటి 5 క్రీడలలో జిల్లా స్థాయి ఆటల పోటీలకు చేరుకున్న క్రీడాకారులకు చిత్తూరు జిల్లాను రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాల్సిన బాధ్యత ఉందన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలలో మొదటి బహుమతిగా రూ.60 వేలు, రెండవ బహుమతిగా రూ.30 వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలు అందించడం జరుగుతుందని, బాడ్మింటన్ క్రీడలలో మొదటి బహుమతిగా రూ.35వేలు, రెండవ బహుమతిగా రూ.20 వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలు అందించడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులకు భోజనం, తాగు నీరు వసతి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో స్కేటింగ్‌లో రాణించిన క్రీడాకారులు నితిన్, శ్రావణి, ఖోఖో లో జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు రాజ్ కుమార్, కబడ్డీలో జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారిణి గుల్జార్‌లను మేయర్, జేసి అభినందించారు. కార్యక్రమం ప్రారంభోత్సవ అనంతరం నియోజకవర్గాల వారీగా క్రీడాకారుల పరిచయ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జెడ్పి సిఈఓ ప్రభాకరరెడ్డి, నగర కమిషనర్ అరుణ, చిత్తూరు ఆర్డిఓ చిన్నయ్య, డిఎస్‌డిఓ బాలాజీ, డిఎల్‌డిఓ రవి కుమార్, నియోజకవర్గ నోడల్ అధికారులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం ప్రక్రియగా ఓటరు నమోదు: డిఆర్ఓ

రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ రాజశేఖర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓటరు నమోదు కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ తెలిపారు. బుధవారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ ఛాంబర్‌లో రాజకీయ పార్టీలతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ఫారం-6, 7, 8 ఫారంలకు సంబంధించి సకాలంలో పరిశీలించి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓ కార్యాలయాల వద్ద, పోలింగ్ స్టేషన్‌ల వద్ద మొబైలు వాహనాల ద్వారా ఈవిఎంలు, వివి ప్యాట్‌పై అవగాహన కల్పించడం జరుగుతున్నదన్నారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ అధికారులకు సూచనలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులుచ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సెక్రెటరీ వి.సురేంద్ర కుమార్, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎన్.ఉదయ్ కుమార్, బహుజన సమాజ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులు, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో పన్నుల వసూళ్లపై ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య విభాగం, ప్రణాళిక విభాగం, అకౌంట్స్ సెక్షన్ అధికారులు, వార్డు అడ్మిన్ కార్యదర్శులు, సీవోలు, ఆర్వీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని విభాగాలు సమన్వయంతో పన్నుల వసూళ్లు కోసం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రధానంగా ఆస్తి పన్ను వసూళ్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికతో క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. ప్రతి వార్డుకు సంబంధించి క్లస్టర్ స్థాయిలో పన్నుల జాబితాను, దీర్ఘకాలిక బకాయిల జాబితాను సిద్ధం చేసి, ప్రతిరోజూ డోర్ టు డోర్ వెళ్లాలన్నారు. పన్నుల వసూళ్ల కోసం వార్డుల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రత్యేక అధికారులు వార్డు అడ్మిన్ కార్యదర్శులను, వాలంటీర్లను సమన్వయం చేసుకొని పన్నులు వసూళ్ళు వేగవంతం చేయాలన్నారు. పన్నుల వసూళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పాజిటివ్‌గా మాట్లాడాలన్నారు. పన్ను చెల్లింపుదారులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. వాటర్ టాక్స్, అడ్వర్టైజ్మెంట్, ట్రేడ్ లైసెన్స్, క్లాప్ యూజర్ ఛార్జీలు వసూళ్ల పైన సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. వార్డు, క్లస్టర్ స్థాయిలో రూపొందించిన ప్రణాళిక ద్వారా పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, సీఎంఎం గోపి, ఆర్వో గోపాలకృష్ణ, వార్డు కార్యదర్శులు, సీవోలు ఆర్పీలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ అరుణ

చిరు వ్యాపారులకు అండగా జిజేఎం ట్రస్ట్

బండ్లు పంపిణీ చేస్తున్న గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏరోజుకారోజూ పొట్టకూటి కోసం అష్టకష్టాలు పడుతున్న చిరు వ్యాపారులకు అండగా జిజేఎం ట్రస్ట్ నిలుస్తోంది. తోపుడు బండ్లు, పానీపూరి బండ్లల కోసం వేలకు వేలు ఖర్చు చేయలేని పేద చిరు వ్యాపారులను ఆదుకొనేలా తోపుడు బండ్లు ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు వ్యాపారాన్ని ప్రారంభించేందుకు పెట్టుబడి నిధిని కూడా అందిస్తూ తన దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. జిజేఎం ట్రస్ట్ అధినేత గురజాల జగన్మోహన్ చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని పేద చిరు వ్యాపారులను గుర్తించి తొడ్పాటును అందిస్తున్నారు. ఇప్పటి వరకు ఐదు దఫాలుగా చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, పానీ పూరి బండ్లు అందజేశారు. ఆరో విడతగా బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని జిజేఎం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో తెలుగుదేశం మాజీ ఎంఎల్‌సి దొరబాబు, టిడిపి మాజీ కార్పొరేటర్లు సమక్షంలో పేద చిరువ్యాపారులకు తోపుడుబండ్లు, పూనిపూరి బండ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గురుజాల జగన్మోహన్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను అధికార పార్టీ అడుకొనే ప్రయత్నం చేస్తోందన్నారు. సిమెంట్ బల్లలను ఏర్పాటు చేస్తే అనుమతులు లేవంటూ నగర పాలక సంస్థ ఉద్యోగుల తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతల ఏర్పాటు చేస్తున్న బోర్డులు, ఫ్లెక్సీలు, బల్లలకు ఎలాంటి అనుమతి లేకున్నా పట్టించుకోవడం లేదన్నారు. సేవా కార్యక్రమాలు ఎవరు చేసినా స్వాగతించాలన్నారు.

పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం

ప్రజాశక్తి- నగరి: అన్ని వార్డులలోను ప్రజల అవసరాలు తీర్చుకుంటూ ముందుకు వెళుతున్నామని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. బుధవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదేశానుసారం మున్సిపల్ అధికారులు సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలున్నా, వార్డుల్లో ఏవైనా సమస్యలున్నా తెలపాలంటూ మున్సిపల్ చైర్మన్ సభ్యులను కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ భారతి మాట్లాడుతూ కుశస్థలి నదిపై రోడ్డు సమస్యను రెండు సమావేశాల్లో కౌన్సిల్ దృష్టికి తెచ్చానని నేడు మంత్రి ఆర్కేరోజా రోడ్డు పనులు పూర్తిచేశారని ఆమెకు కౌన్సిల్ నుంచి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ మంత్రి సహకారంతో మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లోను అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రెండు కోట్ల మేర నిధులతో సిమెంటు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు ప్రారంభించగా అవి వేగంగా జరుగుతోందన్నారు. ప్రజావసరాలకు తగిన విధంగా అభివృద్ధి పనులు చేస్తూ వెళుతున్నామన్నారు. వైస్‌చైర్మన్ వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. కౌన్సిల్ ఆమోదించిన అంశాలు ఇలా ఉన్నాయి. సాధారణ ఎన్నికలు 2024కు సంబంధించి పోలింగ్ బూత్‌ల వద్ద ర్యాంపు, తాగునీరు, టాయిలెట్లు, విద్యుద్దీకరణ తదితర మౌళిక వసతులు ఏర్పాటుచేయుటకు రూ. 1.98 లక్షల నిధులు వెచ్చించటం. రూ. 75 లక్షల గడప గడపకు నిధుల ద్వారా మున్సిపల్ పరిధిలో సీసీ రోడ్లు, కాలువల నిర్మించటం. రూ. 8 లక్షల నిధులతో కాకవేడు రెవిన్యూ, జీవీఎన్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణం. రూ. 20 లక్షల నిధులతో 6వ వార్డు శ్మశాన వాటికలో టాయిలెట్లు, షెడ్డు నిర్మాణం.

డీటీ లక్ష్మీపతి సేవలు అభినందనీయం

లక్ష్మీపతిని సన్మానిస్తున్న తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- కార్వేటినగరం: డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీపతి సేవలు అభినందనీయమని తహసీల్దార్లు రవికుమార్, అమరేంద్రబాబులు అన్నారు. బుధవారం పుత్తూరులోని ఏఎండీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన డీటీ లక్ష్మీపతి పదవీవిరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న తహసీల్దార్లు మాట్లాడుతూ లక్ష్మీపతి రెవెన్యూ శాఖ సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పనిశారని కొనియాడారు. ఎంపీపీ లతబాలాజీ బాలాజీ మాట్లాడుతూ మండలంలో భూ సమస్యల పరిష్కారంలో డీటీ లక్ష్మీపతి తనదైన శైలిలో విధులు నిర్వహించి రైతులకు సేవలు అందించారని పేర్కొన్నారు. అనంతరం లక్ష్మీపతి దంపతులను అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు శాలువలు కప్పి, గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీడీ చిన్నరెడ్డప్ప, ఎంపీడీఓ మోహన్ మురళీ, ఎంఈవోలు విజయకుమార్, మనోజ్ కుమార్, మండల కో-ఆప్షన్ మెంబర్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ ధనంజయవర్మ, మండల సర్వేయర్ సురేష్, విలేజీ సర్వేయర్లు, పలువురు పాల్గొన్నారు.

సరోజమ్మ సేవలు గుర్తు ఉండిపోతాయి

ప్రజాశక్తి పెద్దపంజాణి: మండలంలోని శివాడి పంచాయతీ కార్యదర్శిగా ఆ పంచాయతీ అభివృద్ధికి కృషిచేసిన వ్యక్తి సరోజమ్మ అని, ఆమె సేవలు అభినందనీయమని ఎంపీపీ రెడ్డప్ప అన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిగా సేవలందించిన సరోజమ్మ పదవీ విరమణ కార్యక్రమాన్ని మండల అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ సరోజమ్మ సున్నిత మనస్తత్వంతో పంచాయతీ ప్రజలకు సేవలు అందించిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మండల కన్వీనర్ బాగారెడ్డి, సర్పంచ్ల సంఘం అధ్యక్షులు హరినాథ్, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, పలమనేర్ మార్కెటింగ్ డైరెక్టర్ సురేష్, కోఆప్షన్ నెంబర్ రహమతుల్లా, శంకర్రాయిలపేట పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, ఉప సర్పంచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని జీడిమాకనపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రాజయ్య, ఉగ్గిని పాఠశాలలో పనిచేస్తున్న డి.చిన్నయ్య పదవీవిరమణ సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం వారికి ఘన సన్మానం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వారు అందించిన విద్యను గురించి, పాఠశాల అభివృద్ధికి వారు చేసిన సేవల గురించి కొనియాడారు. మండల ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యోగికి సన్మానం

ప్రజాశక్తి - సోమల: మండల కేంద్రమైన సోమల గ్రంథాలయంలో గత 35 సంవత్సరాలుగా బాధ్యతలు చేపట్టి బుధవారం పదవీవిరమణ చేసిన రామకృష్ణను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కలికిరి, చౌడేపల్లి గ్రంథాలయ నిర్వాహకులు గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి ముని వెంకటప్ప, జగన్మోహన్ తదితరులు రామకృష్ణను సన్మానించి మిఠాయిలు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తాను గ్రంథాలయంలో బాధ్యతలు చేపట్టినప్పటి నుండి గ్రామస్తులు ఎంతో ఆదరించారని వారి అభిమానాన్ని ఆప్యాయతను మరిచిపోలేనని అన్నారు.

టిటిడి అటవీ కార్మికులకు మద్దతుగా..

నేడు ప్రముఖులతో ఎడి బిల్డింగ్ వద్ద దీక్ష

క్షీణిస్తున్న దీక్షా కార్మికుల ఆరోగ్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నిరాహారదీక్ష చేస్తున్న టిటిడి అటవీ కార్మికుల ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. బీపీ, సుగర్ లెవల్ బాగా పడిపోవడంతో వారి ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారు. మూడు సంవత్సరాల రెండు నెలలుగా కార్మికులు రిలేదీక్షలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నిరాహారదీక్షలకు పూనుకున్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి సహా తొమ్మిది మంది నిరాహారదీక్ష చేస్తుండగా టిటిడి పోలీసులను ఉసిగొల్పి అరెస్టు చేయించింది. అయితే కార్మికులు మొక్కవోని దీక్షతో రెండో విడత మరో ఏడుగురు కార్మికులు దీక్షలను కొనసాగిస్తున్నారు. సమస్య పరిష్కారంచేంత వరకూ పట్టు వీడేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరి దీక్షలకు మద్దతుగా గురువారం ఉదయం 10 గంటలకు టిటిడి పరిపాలన భవనం ఎదురుగా అన్ని రాజకీయ పక్షాలు, తిరుపతి ప్రముఖులతో ఒకరోజు నిరాహార దీక్షను చేపట్టాలని నిర్ణయించారు. వివిధ రాజకీయ పక్షాల నేతలు, తిరుపతిలోని ప్రముఖులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతారని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు.

జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం..

పూతలపట్టు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్

ప్రజాశక్తి- ఐరాల

జరగబోయే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డిని సీఎం చేయడమే మన అందరి లక్ష్యం అని పూతలపట్టు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. ఐరాల మండలం కాణిపాకం నారాయణాద్రి కళ్యాణ మండపంలో బుధవారం మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి (బుజ్జిరెడ్డి) ఆధ్వర్యంలో సునీల్ కుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికల్లో ఐరాల మండలంలో ఎంపీపీ, జడ్పిటిసిని పోగొట్టుకున్నామని, అప్పుడు పడిన కష్టాలు ఇక మీదట జరగదన్నారు. చంద్రబాబు నాయుడు మోసపూరిత మాటలతో ప్రజలను మాయ చేస్తున్నాడని కుట్రలు కుతంత్రాలు చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యని ఆయన గుర్తు చేశాడు. టిడిపి ఎన్నికల్లో గెలవలేక వైఎస్ కుటుంబంలో చిచ్చు పెట్టిందని ఈ విషయాలను మన కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. జరగబోయే ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా ఉండి పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. శిశు సంక్షేమ శాఖ రాయలసీమ జోన్ చైర్ పర్సన్ శైలజ చరణ్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, వైస్ ఎంపీపీలు రోజా ప్రభాకర్‌రెడ్డి, నిత్య సురేష్‌రెడ్డి, సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, కాణిపాకం పాలకమండలి అధ్యక్షులు మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు జగన్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూహక్కుల యాజమాన్య చట్టం-2022ను రద్దు చేయాలి

న్యాయవాదుల ఆందోళనకు మద్దతు తెలిపిన భారతచైతన్య యువజన పార్టీ

ప్రజాశక్తి- పుంగనూరు: స్థిరన్యాయ నిబంధనలకు విరుద్ధంగా, న్యాయ వ్యవస్థ అధికారాలలో జోక్యం చేసుకునేలా ఏపి ప్రభుత్వం తెచ్చిన ఆంధ్రప్రదేశ్ భూహక్కుల యాజమాన్య చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని విజయవాడలో న్యాయవాదులు చేస్తున్న ఆందోళనకు బుధవారం ఆయన మద్దతు తెలిపారు. ఈ మేరకు పార్టీ ప్రతినిధి బృందాన్ని ఆయన కోర్టు వద్దకు పంపారు. బిసివై పార్టీ ప్రతినిధి బృందం సభ్యులు న్యాయవాదులకు సంఘీబావం తెలిపి ప్రసంగించారు. తమ అధినేత ఆదేశాల మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు నిరసనగా జరుగుతున్న ఆందోళనకు పూర్తి స్థాయి మద్దతు ఇచ్చేందుకు వచ్చామన్నారు. ఈ చట్టం ద్వారా భూహక్కుల యాజమాన్య విషయంలో సమూల మార్పులు చేస్తూ సుప్రీం కోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకోకుండా... స్థిర న్యాయ నిబంధనలకు విరుద్ధంగా, భూ యాజమాన్య హక్కులను నిర్ధారించే అధికారాన్ని ఏమాత్రం న్యాయ పరిజ్ఞానం లేని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తూ భూహక్కుల ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సమాజంలో సంక్షోభం తలెత్తినప్పుడు దాన్ని సరిదిద్దే మేధావి వర్గమైన న్యాయవాదులు ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయకపోతే బిసివై పార్టీ ఆందోళనలు ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

శ్రీవారి సేవలో తమిళ హీరో ధనుష్

ప్రజాశక్తి -తిరుమల

తమిళ సినీ నటుడు ధనుష్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం తిరుపతిలో సినిమా షూటింగ్ షెడ్యూల్ లో పాల్గొన్న ధనుష్ రాత్రి తిరుమలకు చేరుకొని బుధవారం ఉదయం విఐపి విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం రంగ నాయకుల మండపంలో వేదపండితులు ధనుష్ కు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసారు.

శ్వేత డైరెక్టర్‌గా భూమన సుబ్రమణ్యం రెడ్డి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: టీటీడీకి చెందిన శ్రీ వెంకటేశ్వర ఉద్యోగుల శిక్షణా అకాడమీ (శ్వేత) డైరెక్టర్ గా భూమన్ (భూమన సుబ్రహ్మణ్యం రెడ్డి) బుధవారం బాధ్యతలు చేపట్టారు. టిటిడి కళాశాల లో సుధీర్ఘ కాలం అధ్యాపకుడుగా పని చేసి పదవీ విరమణ చేసిన భూమన్ రాయలసీమ ఉద్యమ నాయకుడుగా, ఉపన్యాసకులుగా ప్రసిద్ధి చెందారు. గతంలో శ్వేత డైరెక్టర్ గా పని చేసారు. ఆ సమయంలో ఉద్యోగుల శిక్షణా కార్యక్రమాలతో పాటు తరిగొండ వెంగమాంబ ప్రాజెక్ట్ ఏర్పాటు కు, టి టి డి డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కు విశేష కృషి చేసారు. ఆయన సోదరుడు భూమన కరుణాకర్ రెడ్డి ప్రస్తుతం తిరుపతి శాసనసభ్యుడు, టి టి డి చైర్మన్ గా ఉన్నారు. ఇటీవలి ధర్మకర్తల మండలి తీర్మానం ప్రకారం భూమన్ ను మరోసారి శ్వేత డైరెక్టర్ గా నియమిస్తూ టి టి డి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ప్రకారం రెండేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆయన శ్వేతా భవనం వద్ద బాధ్యతలు చేపట్టారు.

గురుమూర్తికే తిరుపతి ఎంపి పగ్గాలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి పార్లమెంట్ పగ్గాలు ఎంపి మద్దెల గురుమూర్తికే అప్పగిస్తూ అధిష్టానం వెనకడుగు వేసింది. తొలుత సత్యవేడు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా నియమించి, అక్కడి సిట్టింగ్ ఎంఎల్ఏ ఆదిమూలానికి పార్లమెంట్ బాధ్యతలు అప్పగించింది. అయితే ఆదిమూలం టిడిపి తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధం కావడంతో గురుమూర్తిని తిరిగి తిరుపతి పార్లమెంట్‌కే బాధ్యత అప్పగించింది. జీడీనెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్‌ను సత్యవేడు ఇన్‌ఛార్జిగా ప్రకటించింది. రాజేష్ పెద్దిరెడ్డి అనుచరుడు. మాజీ మంత్రి గుమ్మడి కుతూహలమ్మ అల్లుడు కావడం విశేషం. రెండు రోజుల క్రితం 'ప్రజాశక్తి'లో రాజేష్‌కు తిరుపతి ఎంపి పగ్గాలు ఇస్తారని ప్రచురించింది. అయితే అనూహ్య పరిణామాల నేపథ్యంలో గురుమూర్తికి ఎంపి పగ్గాలు అప్పగించి, రాజేష్‌కు సత్యవేడు బాధ్యత అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఏదిఏమైనా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేలోపు ప్రకటించిన సీటు సైతం ప్రకటించినట్లుగా ఉంటుందో లేదో వేచి చూడాల్సిందే.

క్రైం న్యూస్

సరదా తెచ్చిన తంట- మాజీ జవాన్ అరెస్ట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సరదా కోసం తుపాకీ పేల్చి జైలుపాలైన మాజీ జవాన్ మల్లికార్జున (ఫైల్‌ఫోటో)

సరదాగా స్నేహితులు నిజమైన ఫిస్టల్ కాదని ఎగతాలి చేయంతో నిరూపించేందుకు టింగర్ నొక్కి అబాసుపాలైన మాజీ జవాన్ సంఘటన బుధవారం చిత్తూరులో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సిఐ విశ్వనాథరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక గిరింపేటకు చెందిన మాజీ జవాన్ మల్లికార్జున అతడి స్నేహితులు మద్యం తాగేందుకు గిరింపేటలోని నందీ బార్‌కు వెళ్లారు. మద్యం తాగిన తరువాత బార్ ఎదుటే స్నేహితుల నీ దగ్గర ఉన్న ఫిస్టల్ నిజమైంది కాదంటూ ఎగతాలి చేయడంతో ఆది నియమైనదేని నిరూపేందుకు మత్తులో ఉన్న మల్లికార్జున తన వద్ద ఉన్న ఫిస్టల్‌ను తీసుకొని భూమిలోకి కాల్చారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 10 సమయంలో చోటు చేసుకుంది. హఠాత్తుగా పెద్దశబ్ధం రావడంతో చుట్టుపక్కల వాళ్ళు భయబ్రాంతులకు గురై పరుగులు తీశారు. బార్ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు మల్లికార్జును అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న ఫిస్టల్, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఫిస్టల్ 0.32గా గుర్తించారు. నిందితుడ్ని రిమాండ్ తరలించారు.

బైరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి గ్రామానికి చెందిన అమీర్, కార్తిక్‌కు గత కొంత కాలంగా భూ వివాదం ఉంది. ఈ సమస్య మండల స్థాయిలో పరిష్కారం కాకపోవడంతో ఇద్దరు కోర్టు వెళ్లారు. కోర్టులో గత కొన్ని సంవత్సరాలుగా వాదోపవాదనలు జరిగాయి. కోర్టు సదరు గ్రామానికి చెందిన అమీర్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగింది. కోర్టులో తీర్పు అనుకులంగా రావడంతో అమీర్ తన స్థలంలో గోడ నిర్మించడానికి పనులు చేపట్టారు. కాగా కట్టిన గోడను వైసిపి నేత కార్తిక్ తన కుటుంబ సభ్యులు కలసి కూల్చేశారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి తనకు అన్యాయం జరిగిందని రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ గొడవలో స్థానిక టిడిపి సర్పంచ్ అమీర్ తనయుడు ఆజాద్ కాళ్ళు ప్రత్యర్థులు విరగొట్టారు. దీంతో విషయం పోలీసు స్టేషన్ వరకు వెళ్లింగి తమకు న్యాయం జరగాలంటూ టిడిపి మండల అధ్యక్షులు కిషోర్ గౌడు, కార్యదర్శి సుబ్బన్న, భువన చంద్ర పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కొంత సమయం పోలీసు స్టేషన్‌లో ఉత్రిక్తత పరిస్థితి నెలకొంది. కాగా అమీర్‌ను పోలీసులు పలమనేరు సిఐ కార్యాలయం వద్ద తీసుకెళ్లారు. కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని, తమపై వైసిపి నాయకులు దాడి చేశారని అయినప్పటికీ అమీర్‌ను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం అన్యాయమంటూ టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. పోలీసులు సైతం వైసిపి నాయకులకు తొత్తులుగా వ్యవహిస్తున్నారని ఆరోపించారు.

వ్యక్తి పై తేనె టీగల దాడి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: వ్యక్తిపై తేనెటీగలు దాడి చేసిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని సాకేపల్లి గ్రామ సమీపంలోని టెంకాయ తోపులో టెంకాయల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న విశ్వనాథ్ (32) చెట్టు నుంచి టెంకాయలు దింపే తరుణంలో తేనెటీగలు హఠాత్తుగా దాడి చేశాయి. ఈ దాడిలో తేనెటీగలు తీవ్రంగా కుట్టడంతో అతని పరిస్థితి విషమంగా మారింది. దీంతో స్థానికులు అతన్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి మెరుగైన చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 ద్వారా తరలించారు.

గురుకుల పాఠశాల ప్రవేశం కొరకు

23 లోపు దరఖాస్తు చేసుకోండి

ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ దమయంతి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు (బంగారెడ్డిపల్లె) బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశపరీక్ష కోసం ఈ ఏడాది ఫిబ్రవరి నెల 23వ తేదిలోపు ఆన్లైన్లో దరఖాస్తులు అప్లై చేసుకోవాలని ఇన్చార్జి ప్రిన్సిపాల్ దమయంతి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అయితే 1.9.2011 నుండి 31.8.2015 మధ్య పుట్టినవారై ఉండాలని, అదేవిధంగా ఓసి, బీసీ, ఎస్సీ కన్వర్టర్ క్రిస్టియన్లు అయితే 2013 నుండి 31.8.2015 మధ్య జన్మించిన బాలికలైన వారై ఉండాలన్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో 3వతరగతి అదేవిధంగా 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి నిరవధికంగా ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువు పూర్తి చేసి ఉండాలని చెప్పారు. మిగిలిన వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించారని ఆమె కోరారు.

2,3, తేదీల్లో ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- గంగవరం: మదర్ తెరిసా విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2,3 తేదీలలో ఇంజనీరింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమం కుప్పం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, బెంగళూరు సైనోఫిసన్ సాఫ్ట్వేర్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. ఇందులో 70 ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని ఈ కార్యక్రమానికి డిఇఓ జై చంద్రబాబు, డివైఈవో చంద్రశేఖర్ హాజరైతారని తెలిపారు. పలమనేరు పరిసర ప్రాంతాల ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని వారి నైపుణ్యతను పెంపొందించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అకాడమిక్ అధికారి రాజేందర్ రెడ్డి, కరస్పాండెంట్ రవీంద్రబాబు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి : ఏపిటిఎఫ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పురపాలక, నగరపాలక పాఠశాలలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు గోపినాథ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నర్వహించారు. గోపినాథ్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన పురపాలక, నగరపాలక పాఠశాల సంఖ్యను పెంచాలని, పోస్టులు మంజూరు చెయ్యాలని డిమాండ్ చేశారు. మండలాల్లో సరాసరి 10 ఉన్నత పాఠశాలలుంటే చిత్తూరులో కేవలం ఐదు ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించాలని, వెంటనే బదిలీలు చేపట్టాలని కోరారు. అనంతరం నాయకులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. రాష్ట్ర కౌన్సిలర్ శివశంకర్, జిల్లా నాయకులు వాసు, జగదీష్, మధు, చందు, ప్రతాప్, హరినాథ్,గోపినాథ్ ఆదిత్య, నాగరాజ్, సుదీర్, ఆగస్టిన్, చంద్రశేఖర్, మహబూబ్ బాషా, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

సంక్షిప్త వార్తలు

చంద్రబాబుతోనే సంక్షేమం

ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: చంద్రబాబుతోనే సంక్షేమమని పూతలపట్టు నియోజకవర్గం టిడిపి అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని సంక్రాంతి పల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యతు గ్యారంటీ కార్యక్రమం మాజీ ఎంపీటీసీ మహేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రతి గడపకి వెళ్లి తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాలు గురించి వివరించి కరపత్రాలను పంచిపెట్టారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి సహకరించాలని కోరారు. మండల ఉపాధ్యక్షులు కమల్నాథరెడ్డి, భాష్యం వంశీ చౌదరి, మంజునాథ్, సూర్యనాయుడు, రమేష్, హరిబాబు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలోకి చేరిక

ప్రజాశక్తి- పలమనేరు: నియోజకవర్గంలోని బయప్పగారిపల్లి పంచాయతీ ఊసరపెంట, మండపేట, కోటూరు గ్రామాల్లో బుధవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు. ఆయనకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా పలువురు వైసిపి నాయకులు అమరనాథరెడ్డి సమక్షంలో టిడిపిలోకి చేరారు. వారిన్ని ఆయన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మండిపేట కోటూరు గ్రామానికి చెందిన సంతోష్ నాయుడు, కొల్లా బాబు నాయుడు, ప్రకాష్, హరిజనవాడకు చెందిన గుణశేఖర్, అన్బు, మహేష్, శివలింగం, మణి పాండు, విజయ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: వృత్తి విద్య కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని ఆదర్శ పాఠశాల కమ్మనపల్లి విద్యార్థులకు ఫీల్డ్ అవగాహన సదస్సును నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.కార్తీక్ మురళీమోహన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సచివాలయంకు తీసుకెళ్లి నైపుణ్యత శిక్షణ తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు విద్యతో పాటు వృతివిద్యపై కూడా అవగాహన కల్పించేందుకు ఈ ఫీల్డ్ ట్రిప్‌ను నిర్వహించినట్లు తెలిపారు.

టిడిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని పేరూరు, రామాపురం తండా, కొర్నాల కొండ గ్రామాలకు చెందిన చిన్నన్న, రెడ్డి నాయక్, చిన్న తాయమ్మ అనారోగ్యంతో బుదవారం మృతి చెందారు. టిడిపి నేతలు, కార్యకర్తలు వారి భౌతిక కాయలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పార్టీ ఆదేశాలతో వారి కుటుంబ సభ్యులకు తక్షణసాయంగా రూ.10వేల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు, కృష్ణానాయక్, రామ్మూర్తి, మనోహర్, వెంకటరమణ, గజేంద్ర, విజయ్ కుమార్ రెడ్డి, విశ్వనాథ్, ఆదిల్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీకి పూర్తి రక్షణ ఇవ్వాలి

ప్రజాశక్తి- పుంగనూరు: రాహుల్ గాంధీకి కేంద్ర ప్రభుత్వమే పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందని జిల్లా ప్రియాంకసేవాదళ్ అధ్యక్షులు ఎస్.సజ్జాద్ బాష బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న కారుపై కొంతమంది దాడి చేయడం చాలా దురదృష్టకరమన్నారు. భారత జూడో న్యాయయాత్రలో పాల్గొంటున్న రాహుల్ గాంధీకి పూర్తిగా రక్షణ ఇవ్వాలని కోరారు. రాహుల్ గాంధీ, వైయస్ షర్మిలకు ప్రత్యేక భద్రత కల్పించాలని కోరారు.

ఇంటిపట్టాలు ఇప్పించండి మహాప్రభు

ప్రజాశక్తి - రేణిగుంట: కరకంబాడి పంచాయతీ గుట్టపై దాదాపు గుర్తు తెలియని రెండువేల మంది పేదలు గుడారాల పండుగను తలపించేలా బుధవారం గుడారాలను వేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి తమకు సొంతిల్లు లేదని, ఇంటి పట్టాలు లేవని అన్నారు. గుట్టపై ఉన్న ఖాళీ జాగాలో గుడారాలు వేసుకుని ఉంటానికి సిద్ధపడ్డామని, ఇంటి పట్టాలు ఇప్పించాలని రెవెన్యూ వారిని ప్రాధేయ పడుతున్నారు. ఖాళీ స్థలాన్ని పేదలకు ఇచ్చి తమ సొంత ఇంటి కలను నెరవేర్చాలన్నారు. జగనన్న ప్రభుత్వంల తమకు ఇంటి పట్టాలు రాలేదని, అందుకే ప్రభుత్వ భూమిలో గుడారాలు వేసుకుని ఉండటానికి సిద్ధమయ్యామన్నారు. ఈ విషయమై రెవెన్యూ సిబ్బంది స్పందిస్తూ ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా గుడారాలు వేసుకోకూడదని, ఒకవేళ వేసుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నిజమైన పేదవారు ఉంటే అలాంటివారికి కచ్చితంగా ఇంటిపట్టాలు ఇచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అయినా వారం రోజులుగా పేదలు ప్రభుత్వంపై నమ్మకం లేక గుడారాలు వేసుకుని ఇంటి పట్టాలు ఇచ్చేంత వరకూ అక్కడనుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు.

రేపు డయల్ యువర్ ఈవో

ప్రజాశక్తి - తిరుమల: డయల్ యువర్ ఈవో కార్యక్రమం ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుండి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

ధార్మిక సదస్సు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - తిరుమల: ఫిబ్రవరి 3-5 తేదీల్లో తిరుమలలో జరగనున్న వేద ధార్మిక సదస్సు ఏర్పాట్లను టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పరిశీలించారు. దాదాపు 57 మంది పీఠాధిపతుల సలహాలు తీసుకోనున్నారు. బాలబాలికల స్థాయి నుంచే హిందూ వ్యాప్తి చేయాలని కంకణం కట్టుకున్నామని, ఈ ధార్మిక సదస్సుతో దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక ఉద్యమం కలుగుతుందన్నారు.